## క్లుప్తంగా

### ఆధార్ అప్‌డేషన్ డ్రైవ్



వంతరాంలో సచివాలయం వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న సిబ్బంది

**బలిజిపేట:** ఆధార్ అప్‌డేషన్‌కు వంతరాం, అరసాడలలో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నిబంధన ప్రకారం అన్ని వయస్సుల వారు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. అందులో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది. ఆధార్‌కార్డు తీసుకుని 10 సంవత్సరాలు పూర్తయిన వారు తప్పకుండా అప్‌డేషన్ చేయించుకోవాలని ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాలకు ఆధార్ అవసరం ఉన్నందున అప్‌డేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లతో ప్రజలు వారివారి ఆధార్‌లను అప్‌డేషన్ చేయించుకుంటున్నారు.

### విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివకేశవరావు

**పార్వతీపురం టౌన్:** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు శివ కేశవరావురావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలం నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు ఆర్.రత్న కుమార్, కార్యదర్శి, డి.చంద్రమౌళి, ఏపీటీఎఫ్ నాయకులు బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తల చిత్ర పటాలను ప్రదర్శించారు.

### నిధి ఆప్‌కే నిఖత్‌పై అవగాహన



పవర్‌పాయింట్ ద్వారా వివరిస్తున్న పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామారావు

**పార్వతీపురం:** నిధి ఆప్ కే నిఖత్ (ప్రజల వద్దకే పీఎఫ్)పై అవగాహన కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ గిరిమిత్ర భవనంలో విజయనగరం జిల్లా ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వై.రామారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎఫ్‌కు సంబంధించి పలు అంశాలపై ఖాతాదారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేసి వివరించారు. అలాగే యజమానులు, సంస్థ సభ్యులు, పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు, ఖాతాదారులు, యజమానులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా ప్రచురణ



గలావల్లిలో సచివాలయం వద్ద ఓటర్ల జాబితాను ప్రచురిస్తున్న సిబ్బంది

**బలిజిపేట:** మండలంలోని గలావల్లి ఎంపీటీసీ, సుభద్ర పంచాయతీ 6వ వార్డు మెంబరుకు ఉప ఎన్నికల నిర్వహణ దృష్ట్యా సచివాలయాల వద్ద ఓటర్ల జాబితాను సిబ్బంది సోమవారం ప్రచురించారు. గలావల్లి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా మామిడి చంద్రచూడామణి గతంలో ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. అలాగే సుభద్ర పంచాయతీలో 6వ వార్డు మెంబరుగా ఎన్నికైన వి.పరిశినాయుడు ఇటీవల మృతి చెందడంతో ఇక్కడ ఎన్నిక జరగనుంది.

**ఓటర్ల జాబితా విడుదల**



పణుకువలస పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితాను వేలాడదీస్తున్న అధికారులు

**పాచిపెంట:** మండలంలోని మిలియాకంచూరు, పణుకువలస, బొర్రమామిడి పంచాయతీల్లో వార్డుమెంబర్, మాతుమూరు పంచాయతీలో వైస్ సర్పంచ్ ఎన్నికకు సంబంధించి సోమవారం ఓటర్ల జాబితాలు విడుదల చేశారు. ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో జాబితాలు రూపొందించినట్లు ఈఓపీఆర్‌డీ ఎస్‌వీ కుమారి తెలిపారు.

# సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు విజ్ఞప్తి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు

**పార్వతీపురం టౌన్:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం పురపాలక సంఘం పరిధి కొత్తవలసలో ఆయన ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు, యువకులు ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. మొదటి ప్రాధాన్యత క్రమం ఓటును సీతంరాజు పేరు ఎదురుగా వేయాలని గ్రాడ్యుయేట్ ఓటర్లందరికీ తెలపాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు పి.జయంతి, ఆర్ చిన్నంనాయుడు, బి.ఆనంద్, లావణ్య, నాయకులు, కార్యకర్తలు గ్రాడ్యుయేట్ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలి**

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని విద్యావంతులు, ఆధ్యాపకుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు, యువకులు ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన సీతంరాజు సుధాకర్‌ను రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు..

**సీతానగరంలో ప్రచారం**

**సీతానగరం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని జెడ్పీటీసీ ఎం బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం కోరారు. ఈ మేరకు సోమవారం లచ్చయ్యపేట, గుమ్మిడివరంలో పట్టభద్రులైన ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల నాయుకులు ఎం కృపారావు, పట్టభద్రులైన యువకులు పాల్గొన్నారు.

**నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం..**

మండల కేంద్రంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సమావేశం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ బి చిట్టిరాజు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

**సీతంరాజును గెలిపించుకుందాం..**

● ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

**సాలూరు:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుందామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. పట్టణంలోని తన స్వగృహంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాలనను వివరించి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసేలా చైతన్య పరచాలన్నారు. త్వరలోను తాను కూడా గ్రామాలు, వార్డుల్లో పర్యటించి పట్టభద్రులను కలుస్తానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి సుధాకర్‌కు మన నియోజకవర్గం నుంచి ఎక్కువ మెజార్టీ వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు, సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేయడానికి ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, సలహాకమిటీ చైర్మన్‌లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులు హాజరుకావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర

## పొదుపు సభ్యుల జీవనోపాధికి విరివిగా రుణాలు



మాట్లాడుతున్న వెలుగు డీపీఎం (జీవనోపాధి) పి.ప్రవీణ్‌కుమార్

**సీతానగరం:** జిల్లాలోని పొదుపు సంఘాల సభ్యుల జీవనోపాధిని మెరుగు పర్చడానికి వెలుగు ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని వెలుగు జీవనోపాధి ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం సీతానగరం మండల వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఆర్ శ్రీరాములు అధ్వర్యంలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 19,672 పొదుపు సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగు పర్చడానికి, వారి పిల్లల చదువులకు తోడ్పడేవిధంగా ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా రుణాలు సమకూరుస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి ఆహార శుద్ధి మైక్రో పరిశ్రమలు, (పీఎంఈపీ), ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ న్యూట్రిషన్ ఆహారశుద్ధి, శ్రీనిధి పథకాల ద్వారా రుణాలు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా 35 శాతం సబ్సిడీపై రుణాలు సభ్యులకు రుణాలు సమకూరుస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పొదుపు సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, గ్రామైక్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ల ఉపఎన్నికకు నోటిఫికేషన్



జోగింపేట పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ పత్రాన్ని వేలాడదీస్తున్న కార్యదర్శి

**సీతానగరం:** మండలంలోని రెండు గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్ల ఎన్నికకు ఈఓపీఆర్డీ కె.కుమావర్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ మాట్లాడుతూ జోగింపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను పంచాయతీ కార్యాలయాల్లో వేలాడదీసినట్లు తెలిపారు. లచ్చయ్యపేట పంచాయతీ 6వ వార్డు మెంబరు బి పకీరునాయుడు మృతిచెందడంతో ఉపఎన్నిక అనివార్యమైందన్నారు. అలాగే జోగింపేటలో ఎస్టీ కుటుంబాలు లేక పోయినప్పటికీ 1వ వార్డు, 7 వార్డులను కేటాయించారు. వార్డుల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు లేకపోయినా నామినేషన్‌లు వేయడానికి ఎన్నికల నోటిఫికేషన్‌విడుదల చేసినట్లు తెలియ జేశారు. నోటిఫికేషన్ ప్రతులను పంచాయతీ కార్యదర్శులు లచ్చయ్యపేటలో మురళి, జోగింపేటలో కిరణ్‌కుమార్ పంచాయతీ కార్యాలయాల్లో వేలాడ దీసినట్లు తెలియజేశారు.

## హెల్త్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

**పార్వతీపురం:** హెల్త్ వర్కర్లకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. సాలూరు మండలం మామిడిపల్లి పీహెచ్‌సీ బాగువలసలో పనిచేస్తున్న హెల్త్ వర్కర్లకు గడిచిన ఎనిమిది నెలలనుంచి, పెదబొండపల్లి పీహెచ్‌సీలో 11 నెలలుగా వేతనాలు అందడంలేదన్నారు. హెల్త్ వర్కర్లకు రూ.10వేల వేతనంతోపాటు యూనిఫాం, గుర్తింపుకార్డు, ఇన్సూరెన్సు కల్పించాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇందిర, జి.వెంకటరమణ, సుమలత, లావణ్య తదితరులున్నారు.

## గ్రీన్‌అంబాసిడర్లకు గౌరవ వేతనాలివ్వాలి



ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా నాయకుడు వెంకటరమణ తదితరులు

**సీతానగరం:** మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు గౌరవ వేతనాలను చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రతినిధి జి.వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండల స్థాయి గ్రీన్ అంబాసిడర్లతో సంఘం మండల కార్యదర్శి గౌరీశ్వర్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేస్తూ, చెత్తకుప్పలను తొలగించే గ్రీన్ అంబాసిడర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించి వారికి గౌరవ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

## చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళులు



నేతాజీ గ్రంథాలయం వద్ద చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసిన గ్రామస్తులు

**బలిజిపేట:** చంద్రశేఖర్ ఆజాద్ దేశం గర్వించదగిన ఉద్యమకారుడని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు కొనియాడారు. మండలంలోని పెదపెంకి గ్రామంలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద ఆజాద్ 89వ వర్థంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం నిమిత్తం ఎంతోమంది ప్రాణాలను త్యాగం చేశారని వారిలో ఆజాద్ ఒకరని గుర్తుచేశారు. అటువంటి మహానుభావుని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బి.హర్షవర్ధన్, ఎస్.ప్రసాద్, పి.తిరుపతినాయుడు, కె.మధు, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి

**పార్వతీపురం టౌన్:**

రానున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి జి.మాదవ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అత్యవసర పనులపై చర్చ



మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

**సాలూరు:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జరజాపు దీప్తి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అత్యవసర పనులు, సాధారణ నిధులపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిర్లి ఎల్లమ్మతల్లి జాతర



వనంగుడి వద్ద పోలీసుల గస్తీ



పార్వతీపురం టౌన్: పోతన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పార్వతీపురం టౌన్: క్యూలో బారులు తీరిన భక్తులు

**సీతానగరం:** మండలంలోని అంటిపేట, సీతానగరంలలో సిర్లి ఎల్లమ్మతల్లి జాతర సోమవారం ఘనంగా జరిగింది. పలు ప్రాంతాలనుంచి పెద్దఎత్తున భక్తులు, యువకులు, మహిళలు, విద్యార్థులు జాతరలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దేవాంగుల వీధిలోని సిర్లి ఎల్లమ్మఅమ్మవారి ఆలయంలో వేకువజామున ప్రారంభమైన పూజలు రాత్రివరకు కొనసాగాయి. మహాశివ రాత్రి తరువాత నిర్వహించే ఎల్లమ్మ జాతరలో పసుపుకుంకుమ, జాకెట్ ముక్కలు, తాంబూలాలు, చేపలు, గుడ్లు, ఉలవలు, బియ్యం, అరటిపండ్లతో భక్తులు మొక్కులు తీర్చే పూజలు నిర్వహించారు. ఎల్లమ్మతల్లిని దర్శిస్తే చర్మ వ్యాధులు రావని, కొత్తదంపతులకు సంతానం కల్గుతుందని, అందరికీ తల్లి ఆశీస్సులు ఉంటాయని అర్చకుడు కొనకల గణేష్ ఈ సందర్భంగా భక్తులకు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో ఏఎస్సై శ్రీనివాసరావు బందోబస్తు నిర్వహించారు.

**పోతన్నా...దీవించన్నా..!**

**పార్వతీపురం టౌన్:** సిర్లిపోతన్న జాతర అత్యంత భక్తిశ్రద్ధలతో జిల్లాకేంద్రంలో నిర్వహించారు. ఈ మేరకు సోమవారం దుర్గగుడి వీధిలో గల ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, పైడితల్లమ్మ, బంగారమ్మ, అగ్ని గంగమ్మ తదితర 16 మంది అమ్మతల్లుల సోదరుడు సిర్లిపోతన్న జాతరను ఆలయ నిర్వాహకులు జరిపించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల మండలాల్లోని గ్రామాల ప్రజలు పోతన్న ఆశీస్సులు పొందేందుకు తరలివచ్చారు. పోతన్న ఆలయంలోని నాగేంద్రునికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పోతన్నకు రైతులు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు బియ్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ప్రసాదంగా సమర్పించుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోతన్న ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

## ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



ఉప ముఖ్యమంత్రి రాజన్న దొరకు పుష్పగుచ్ఛమిస్తున్న రామారావు , తదితరులు

**సాలూరు:** వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగంలో బీసీ సెల్ అధ్యక్షుడిగా గరుగుబిల్లి మండల ఎంపీపీ ఉరిటి రామారావును నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను సోమవారం ఆయన స్వగృహంలో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, బీసీ సెల్ బలోపేతానికి కృషి తద్వారా పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం రామారావును డిప్యూటీ సీఎం అభినందించారు.

## పాచిపెంట విద్యార్థుల ప్రతిభ




సాధించిన పతకాలతో విద్యార్థులు

**పాచిపెంట:** ఏలూరులో అదివారం నిర్వహించిన 18వ రాష్ట్ర యూత్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాచిపెంట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 5వేల మీటర్ల నడక పందెంలో ఉత్తారావల్లి ఉమా, 3 వేల మీటర్ల పరుగు పందెంలో ముల్ల హరీష్‌లు బంగారు పతకాలు సాంధించారు. అదేవిధంగా గెమ్మెల.శంకర్ షాట్‌పుట్‌లో వెండి పతకం సాంధించాడు. విద్యార్థులతో పాటు కోచ్ నేతేటి శేఖర్‌ను గ్రామస్తులు అభినందించారు.

## 20 లీటర్ల సారా స్వాధీనం

**పాచిపెంట:** ఓ వ్యక్తి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు. మండలంలోని కూనాంబందవలస గ్రామానికి చెందిన మజ్జి చంద్రరావు అనే వ్యక్తి సోమవారం ఉద యం సారా తరలిస్తుండగా పాచిపెంట సమీపంలో పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ చెప్పారు.

## మంచినీరు సరఫరా చేయాలి

**పార్వతీపురం:** మున్సిపాల్టీలోని కుళాయిలద్వారా మంచినీటిని సరఫరా చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో పార్వతీపురం మున్సిపాల్టీ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. గడిచిన పదిరోజులనుంచి కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు బురదలా వస్తోందని, ఈ కారణంగా పట్టణంలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది రూబెన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సీఐటీయూ నాయకులు ఇందిర, జి.వెంకటరమణ, బి.సూరిబాబు పాల్గొన్నారు.

# వాహనాలకు వేలం



వేలంపాటలో పాల్గొన్న ఎస్ఈబీ సూపరింటెండెంట్ సుధాకర్, ఎస్సై నీలకంఠం.

**సీతానగరం:** గతంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 12వాహనాలకు సోమవారం వేలంపాట నిర్వహించారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ సుధాకర్, ఎస్సై కె.నీలకంఠంల సమక్షంలో ఎస్పీ అదేశాల మేరకు నిర్వహించిన వేలం పాటలో ఆసక్తి కలిగిన వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 12వాహనాలు రూ.86వేల 900లకు వేలం వేసి రూ.15వేల642లు జీఎస్‌టీ విధించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**'నిడగల్లులో పుస్తెలతాడు చోరీ**

మండలంలోని నిడగల్లు గ్రామంలో పరువాడ వాసుదేవనాయుడు భార్య సూర్యకళ మెడలో ఉన్న 45 గ్రాముల పుస్తెలతాడును ఆమె నిద్రలో ఉన్న సమయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి తెంచి పారిపోయాడు. ఆమె కేకలు వేయగా వీధిలో అందరూ లేచి ప్రయత్నించినప్పటికీ ఆ వ్యక్తి దొరకలేదు. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు.